# చక్రభ్రమణం

గంట మ్రోగింది....

ఆ వెంటనే స్పీకర్‌లోంచి ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

"గోదావరి ఎక్స్‌ప్రెస్" మరికొన్ని నిమిషాల్లో ఒకటో నంబరు ప్లాట్‌ఫారం మీదకు వచ్చుచున్నది !"

అంతకుముందు గంటన్నర నుంచీ ప్లాట్‌ఫారం మీద అటూ ఇటూ తిరుగుతూ, అడ్డదిడ్డంగా ఆలోచిస్తూ కాలక్షేపం చేస్తున్న ప్రకాశానికి ఆ ఎన్సౌమెంట్ వినగానే ప్రాణం లేనొచ్చింది.

కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకున్నాడు. ఆ తర్వాత దువ్వెన తీసి తలదువ్వుకున్నాడు. ప్యాంటుజేబుల్లో చేతులు పెట్టుకుని సన్నగా ఈలవేస్తూ రాబోయే రైలుకోసం మరింత ఆత్రంగా చూస్తూ నిలబడ్డాడు.

ప్లాట్‌ఫారం మీద రైల్వే పోర్టర్ల హడావిడి ఎక్కువైంది. రైలుపట్టాలమీదనుంచి దృష్టిని కొనసకంటూ సారించేడు ప్రకాశం. కనుచూపుమేరలో రైలు కనుపిస్తోంది.

తన జీవితంలో ఎన్నోసార్లు అలా స్టేషన్‌లోకి వస్తున్న రైళ్ళను చూసేడు ప్రకాశం. ఎప్పుడూ ఏమీ అనిపించలేదు. కానీ ఇప్పుడు స్టేషన్‌లోకి వస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ కొత్తగా-వింతగా-చైతన్య రథంలా కనిపిస్తోంది. తన ఒంట్లోకి ఒకవిధమైన పులకింత ప్రవేశించి, మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

మళ్ళీ అటువైపు చూసేడు. రైలింకా కనుచూపు మేరలోనే ఉంది. కొత్తపెళ్ళికూతురిలా సిగ్గుపడుతూ స్టేషన్‌లోకి అతి నెమ్మదిగా వస్తోంది.

ఇంక కొన్ని క్షణాల్లోనే ప్లాట్‌ఫారం మీదకు వచ్చి ఆగుతుంది. రైలులోంచి సీత దిగుతుంది. తనను చూడగానే వల్లమాలిన సిగ్గు పడుతుంది.

అవును మరి....కొత్తపెళ్ళికూతురుకి సిగ్గు ఉండదా ?

ఇప్పుడు సీత ఎలా వుందో ?....తను సీతను చూసి నాలుగు నెల లయిపోయింది.

సరిగ్గా నాలుగు నెలల క్రితం-

ఒక రోజు ప్రొద్దున్నే ఎనిమిదిన్నరకి సీతమెడలో మూడుముళ్ళు వేసేడు. అదే రోజు రాత్రి ఎనిమిదిన్నరకి తననూ, సీతనూ ఒక గదిలోకి తోసేసి తలుపులు వేసేశారు.

శోభనం !....వరసగా మూడు రాత్రిళ్ళు....పొంగిపొరలే కోరి కల పరవళ్ళు....రెండు జీవితాలను తీర్చిదిద్దే పరవళ్ళు....!

“ఇప్పుడు నేను ఒంటరిగా వెళ్ళిపోవాలంటే దిగులుగా ఉంది. నువ్వుకూడా నాతో వచ్చెయ్, సీతా !” శోభనం అయిపోయింతర్వాత నాలుగోరోజు పొద్దున్న అడిగేడు తను.

“ఈ మూడు రోజులూ తమరు చేసిన ఘనకార్యానికి కనీసం మూడు నెలలయినా రెస్టు కావాలి ! నాకు....పైగా పరీక్షలు కూడా దగ్గర కొస్తున్నాయి. అందుకని దొరగారు నాలుగు నెలలు ఓపికపట్టాలి:”

తన గిరిజాల జుట్టును వేలితో మెలిపెడుతూ అంది సీత. అప్పుడు ఆమెను తనదగ్గరగా గుండెమీదకు లాక్కుని. ముద్దొచ్చే ఆమె పెదవులపై పిచ్చిగీత గీస్తూ అన్నాడు :

"చదువుకోసం నిద్రాహారాలు మానేసి ఆరోగ్యం పాడుచేసుకోకు ! అసలు నువ్వు పరీక్షపాసై ఉద్యోగం చెయ్యక్కర్లేదు. నాక్కావలసిందల్లా ఈ పెదాలూ, ఈ కళ్ళూ, ఈ అందం....ఇవే !"

తన మాటలకు సీతబుగ్గలు సుగ్గుపడ్డాయి, కనురెప్పలు బరువెక్కి మూతపడ్డాయి. తన రెండుచేతులతోటీ ఆమె ముఖాన్ని పైకెత్తి చూసేడు....

అప్పుడు—ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు చెమక్కుమని మెరిసేయి.

తనకు తెలుసు, అవి ప్రేమాశ్రువులు !

ఆ దృశ్యాన్ని తన గుండెలో ప్రతిష్ఠించుకుని ప్రతి రోజూ, ప్రతి రాత్రి, ప్రతి నిమిషం గుర్తుచేసుకుంటూ ఈ నాలుగునెలలూ గడిపేశాడు.

ఇప్పుడు సీత వచ్చేస్తోంది. తనతో జీవితాన్ని పంచుకోవటానికి కొత్తకాపురంలోకి తొలిసారిగా కుడికాలు పెడుతోంది. సీతను తీసుకొస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారం మీదకు వచ్చేసింది.

ప్రతి కంపార్టుమెంట్‌లోకీ ఆత్రంగా చూస్తున్నాడు ప్రకాశం.

అక్కడ—

అతని చూపులు నిలిచిపోయినచోట—

ఆ కంపార్టుమెంట్ కిటికీలోంచి బయటకు చూస్తూ చెయ్యి వూపుతోంది సీత.

గబగబా అక్కడకు నడిచేడు.

"సామాన్లు అందుకోండి!" కంపార్టుమెంట్లోంచే ఒక సూట్ కేస్ ప్రకాశానికి అందించబోయింది సీత.

"అలా ఉంచెయ్.... పోర్టర్ తీసుకొస్తాడు!" అంటూ పోర్టర్ని పిలిచేడు ప్రకాశం.

"మొత్తం పదహారు శాల్తీలుండాలి!" పోర్టర్ సామాన్లు దించుతూంటే వాటిని లెఖ్ఖపెడుతూ చెప్పింది. లెఖ్ఖపెట్టడంలో ప్రకాశం కూడా సాయం చేసేడు.

"పదిరూపాయ లిప్పించండి! బయటేసేస్తాం!" అన్నాడు పోర్టరు తలపాగా బిగించి కట్టుకుంటూ.

"అమ్మో! పదిరూపాయలే! అనకాపల్లిలో అయిదిచ్చి వేయించాం!" చెప్పింది సీత.

"అనకాపల్లికీ. హైదరాబాదుకీ రేట్లలో చాలా తేడా ఉంటుంది, సీతా!" అని ఆమెకు బదులుచెప్పి, "సరే, జాగ్రత్తగా పట్రా!" అంటూ పోర్టర్కి ఆర్డరేశాడు ప్రకాశం.

"ఈ సంచీ నేను తెస్తాన్లెండి! ఇందులో ఆవకాయ జాడీ వుంది!" ఒక సంచీ తీసుకోబోయింది సీత.

"నువ్వేం తేవద్దు! పదిరూపాయలిస్తున్నాం. వాడే తెస్తాడు. కావాలంటే కొంచెం జాగ్రత్తగా తెమ్మని చెబుదాంలే!" పోర్టర్కి విని పించకుండా ఆమెకు చెప్పి. ఆ సంచీని కూడా పోర్టర్ చేతికి అందించాడు.

ఇద్దరూ స్టేషన్‌లోంచి బయటికొచ్చేరు. సామానంతా డిక్కీలో సర్ది. పదిరూపాయల కాగితం అందుకున్నాడు పోర్టరు.

టాక్సీ బయలుదేరింది.

"ప్రయాణం బాగా జరిగిందా ?" సీతకు కొంచెం దగ్గరగా జరుగుతూ అడిగాడు కొన్ని నిముషాల తర్వాత.

"నాన్న బెర్తు తీసుకున్నారు. నిడదవోలు వచ్చేసరికి నిద్రపట్టేసింది. మళ్ళీ సికింద్రాబాదు దాకా మెలకువ రాలేదు !" చెప్పింది.

"నాకైతే రాత్రి అసలు నిద్రే పట్టలేదు !"

"ఏం ?"

"ఏమో ? ఎప్పుడు తెల్లవారుతుందా అని తూర్పుదిక్కే చూస్తూ పడుకున్నాను. అసలు పొద్దున్నే మెలకువ వస్తుందో రాదోనని ఆరింటికి అలారం కూడా పెట్టుకున్నాను."

"మోగిందా ?"

"ఏమో ! నేను అయిదింటికే వచ్చేశాను స్టేషన్‌కి !" చెప్పాడు ప్రకాశం.

ఆశ్చర్యపోయింది సీత. పోతూనే అడిగింది ;

"అయిదింటికే వచ్చేశారా ? అంత తొందరగా ఎందుకొచ్చారు? రైలు ఏడింటికని తెలీదా ?"

"తెలుసనుకో ! అయినా అప్పుడప్పుడు కొన్ని కొన్ని రైళ్ళు 'బిఫోర్ టైమ్' వచ్చేస్తూంటాయి.... అందుకని...."

నవ్వేసింది సీత.

కాస్సేపటికి టాక్సీ ఇంటిముందు ఆగింది. డిక్కీలో వున్న సామాన్లన్నింటినీ తానొక్కడే గబగబా లోపలకు చేర్చాడు ప్రకాశం.

"ఇల్లు బాగుందండీ! అద్దెంత? లోపలకు వచ్చిన తరువాత ఇల్లంతా పరిశీలనగా చూస్తూ అడిగింది సీత.

"అవన్నీ తరవాత మాట్లాడుకుందాం. బాత్‌రూంలో కుళాయి వస్తూంది. ముందు స్నానం కానియ్. ఈలోగా నేను కాఫీ రెడీ చెస్తాను." బట్టలు మార్చుకుంటూ చెప్పాడు.

"ముందు మీరు కానివ్వండి! మళ్ళీ ఆఫీసుకు టైమవుతుందేమో!"

ఇవాళా, రేపూ ఆఫీసుకి సెలవెట్టేశాను!" గర్వంగా చెప్పేడు ప్రకాశం.

‡ ‡ ‡

రావలసిన టైమ్ కంటే ఒక గంట ఆలస్యంగా వచ్చి ఆగింది గోదావరి ఎక్స్‌ప్రెస్.

భుజంమీద నిద్రపోతున్న చంటిపాపను కుడిచేత్తో జాగ్రత్తగా పట్టుకుని-ఎడం చేత్తో ప్లాస్టిక్ బుట్ట పుచ్చుకొని రైలు దిగింది సీత.

రెండు నిముషాలు అటూ ఇటూ ఆత్రతగా చూసింది. ప్రకాశం కనిపించలేదు.

'ఒకవేళ తాను వస్తున్నట్లు వ్రాసిన పుత్తరం అందలేదా?' అనుకుంది సీత.

'అందకపోతే మాత్రం? ఫలానా రోజున రమ్మని ఆయనేగా చెప్పారు. చంటిపిల్లతోటి వస్తున్నానని తెలిసికూడా ఇలా ఎందుకు

చేశారో? ఒకవేళ స్టేషన్ కొచ్చి బండి లేటని తెలియగానే ఇంటికి వెళ్ళిపోయారా? ఇప్పుడేం చేయాలి?'

అలా ఆలోచిస్తూనే ఆత్రతగా చూస్తున్న ఆమెకు దూరంనుంచి పరుగెత్తుకొస్తున్న ప్రకాశం కనిపించాడు.

"హమయ్య! వచ్చారుకదా!" తృప్తిగా ఊపిరిపీల్చుకుంది సీత.

"వెధవ బండి ఇంత పెందరాళే వస్తుందనుకోలేదు!" రైలు లోంచి సామాన్లు క్రిందికి దించుతూ అన్నాడు ప్రకాశం.

"పెందరాళే రావటం ఏమిటి నాముఖం? గంట లేటుగా వస్తేను!" చంటిదాన్ని మరో భుజం మీదకు మార్చుకుంది.

"మన ఇంటి వాళ్ళింట్లోంచి ఇందాక స్టేషన్‌కి ఫోన్‌చేశాను. గంట లేటన్నారు. గంటంటే ఇంకో అరగంట ఎలాగా అవుతుందను కున్నాను!" సంజాయిషి చెప్పి పోర్టర్‌ని పిలిచేడు.

"మూడురూపాయలిప్పించండి!" సామాను చూసి పోర్టర్ అడిగేడు.

"ఏమిటీ? మూడురూపాయలా? ఈ పెట్టె, బెడ్డింగూ. రెండు చేతిసంచులు....ఈ నాలుగింటికీ మూడురూపాయలా?" ఇంకా ఏదో అనబోతున్న ప్రకాశాన్ని 'డోంట్ కేర్' అన్నట్టుగా చూసి మరో కం పార్ట్‌మెంట్ దగ్గరకు వెళ్ళిపోయాడు పోర్టరు.

"సర్లే! పెట్టే, బెడ్డింగూ నేను తీసుకొస్తానుగానీ, ఈ సంచులు రెండూ నువ్వు పట్రా! తేలిగ్గానే ఉన్నాయిలే!" అంటూ వాటిని ఆమె చేతికి అందించి. పెట్టే, బెడ్డింగూ చెరో చేత్తో పట్టుకుని బయటకు నడిచేడు ప్రకాశం.

ఇద్దరు ఆటో ఎక్కారు.

అప్పటికి సీత ఒళ్ళోపడుకున్న చంటిది నిద్రలేచి. తన లేత పిడికిళ్ళు నోట్లో పెట్టుకుంటూ ఆవులించింది.

"అమ్మో! హైదరాబాద్ వచ్చేశావా?" చంటిదాని బుగ్గమీద సుతారంగా ముద్దుపెట్టుకుంటూ అన్నాడు ప్రకాశం.

"దీనితో నన్నొక్కత్తెనూ పంపటానికి మావాళ్ళు చాలాబాధపడ్డారు. అసలు నాన్న నాతో సాయం వస్తానన్నారు. మీ రెలాగా ఇక్కడి స్టేషన్‌కి వస్తారుకదా— పెద్దాయన్ని ఇబ్బంది పెట్టటం ఎందుకని నేనే వద్దన్నాను!" చంటిదాన్నిభర్తకు అందిస్తూ చెప్పింది సీత.

మరికొంచెం సేపటికి ఆటో ఇంటిముందాగింది. సామాన్లన్నిం టినీ నెమ్మదిగా లోపలకు చేర్చేడు ప్రకాశం.

"ఏమిటీ—పనిమనిషిని మాన్పించేసేరా?" ఇల్లంతా ఇలా చిందర వందరగా వుందేమిటి?" లోపలకు వస్తూనే అక్కడి వాతావరణం చూసి అడిగింది.

"దానికి ఒంట్లో బాగుండటం లేదట. వారం రోజుల్నుంచీ పని లోకి రావటంలేదు. ఆ విషయాలన్నీ తర్వాత మాట్లాడుకుందాంగానీ ముందు కాఫీ సంగతి చూడు. ఈలోగా నేను స్నానం కానిచ్చేసి వస్తాను. ఇవాళ ఆఫీసుకి తొందరగా వెళ్ళాలికూడాను." హడా విడిగా బట్టలుమార్చుకుంటూ అన్నాడు ప్రకాశం.

"పోనీ, ఈ ఒక్క రోజుకి సెలవు పెట్టకపోయారా?" యథా లాపంగా అడిగింది సీత.

"ఇయరెండింగ్‌లో సెలవు లెక్కెట్టించి ఎస్తాయి? ఆ మధ్య బారసాలకి మీ వూరొచ్చినప్పుడు ఉన్న నాలుగు సెలవులూ వాడేశాను. ఫరవాలేదులే! నువ్వేం హైరాన పడకు! కాఫీ ఒక్కటీ కలిపిచ్చేసి, నెమ్మదిగా పనులు చూసుకో-ఈపూటకి భోజనం హోటల్లో లాగించేస్తాను." టవల్ కట్టుకుని బాత్‌రూంలోకి నడిచేడు ప్రకాశం.

* * *

వాలుకుర్చీలో కూర్చుని వేడివేడి కాఫీతాగుతూ, పేపరుచూస్తున్న ప్రకాశం వీధి గుమ్మం దగ్గర ఆటో ఆగిన శబ్దం విని అటు చూసేడు.

ఆటోలోంచి దిగుతున్న సీతనీ, పిల్లల్ని చూసేసరికి ఒక వైపు ఆశ్చర్యం, మరోవైపు ఆనందం కూడా కలిగేయి అతనికి.

"అదేమిటోయ్? పిల్లలకు వేసవి సెలవు లయ్యేవరకూ అక్కడే ఉంటానన్నదానివి అప్పుడే వచ్చాశావేమిటి?" లోపలకు వస్తున్న సీతకు కళ్ళతోటే స్వాగతం చెబుతూ అన్నాడు.

"ఏం....రాకూడదా?"

"అబ్బే? పది రోజులు కూడా ఉండకుండా వచ్చేస్తేను - కొంపతీసి మీ అన్నయ్యలు వెళ్ళిపొమ్మన్నారేమోనని అనుమానం వచ్చింది." వేళాకోళం ధ్వనించేలా అన్నాడు.

"ఇంటాడపడుచుకి అన్నం పెట్టలేని దరిద్రులేం కాదు మా అన్నయ్యలు! మీరు రాకపోయినా మీ బట్టలకోసం రెండు వందలు పంపించారు!" గర్వంగా చెప్పింది సీత.

"అవున్నాన్నగారు! అప్పుడే వెళ్ళిపోవద్దని పెద్ద మావయ్య ఎంత చెప్పినా అమ్మ విన్లేదు. మీరొక్కరు ఇక్కడ ఎంత కష్టపడిపోతున్నారోనని బెంగపెట్టేసుకుంది!" బూటు లేసులు విప్పుకుంటూ

అసలు విషయం చెప్పేడు రవి.

"మీకు అన్నం వండుకోటం సరిగ్గా రాదట. హోటల్ భోజనం పడదట; ఈమధ్య అప్పుడప్పుడూ మీకు ఒంట్లో బాగుండటంలేదట!.... అలా అని అమ్మ మావయ్యకి చెప్పింది." అరుణ అందించింది.

ఆ మాటలు విన్న ప్రకాశం అప్రయత్నంగా సీతవేపు చూశాడు. అతని కళ్ళకు సీత మసక మసగ్గా కనిపించింది. సీతకూడా ఆ క్షణంలో ప్రకాశం అలాగే కనిపించేడు. ఎందుకంటే ఇద్దరి కళ్ళలోకి ఒకేసారి కన్నీళ్ళు ఉబికి వచ్చేయి కనక!

అవి కన్నీళ్ళు కావని ఇద్దరికీ తెలుసు! అవి అనురాగపు సంకెళ్లు! ఆ సంకెళ్లు భార్యాభర్తల అనుబంధాన్ని ఎలా కట్టేసి ఉంచుతాయో, ఎంత బలంగా ఆకర్షించుకుంటాయో పిల్లలకేం తెలుసు?

"ఈసారి ఎందుకో మిమల్ని వదిలి మా వూర్లో ఉండాలనిపించ లేదండీ! అందుకే వచ్చేశాను!" ఆ రాత్రి పిల్లలిద్దరు పడుకున్న తర్వాత భర్త పక్కకు చేరిన సీత చెప్పింది.

"మన పిల్లలిద్దరిమీద ఒట్టువేసి నీకో నిజం చెప్పనా, సీతా?" ఆమెను తన గుండె మీదకు లాక్కుంటూ అడిగేడు ప్రకాశం.

"ఏమిటీ?"

"వెంటనే బయల్దేరి వచ్చేయమని ఇవాళ నీకు ఉత్తరం రాయ్యాలనుకున్నాను....ఈలోగా నువ్వే వచ్చేశావు! ఆశ్చర్యంగా లేదూ?"

"ఏమండీ! ఇకనించీ ఎక్కడకు వెళ్ళవలసివచ్చినా మనిద్దరం కలిసే వెడదామండీ;" భర్త గుండెలో గువ్వలా ఒదిగిపోయింది.

O O O

గడియారం పదకొండు గంటలు కొట్టింది.

గదిలో వెలుగుతున్న 'బెడ్‌లైట్' నీలం వెలుతుర్ని పంచుతోంది. గోడమీద బల్లి దీపం పురుగులకోసం కాపుకాస్తోంది.

మంచంమీద పడుకున్న సీత గోడమీదవున్న బల్లివేపే పరిశీలనగా చూస్తోంది.

సీతా! నిద్ర రావటంలేదా?" అడిగేడు ప్రకాశం.

"లేదండీ! అదిగో ఆ బల్లిని చూస్తున్నాను! మనుషులకున్నట్టే దానికీ ప్రేమలూ, ఆప్యాయతలూ వుంటాయా అని ఆలోచిస్తున్నాను!"

నవ్వొచ్చింది ప్రకాశానికి.

"అర్థంలేని ఆలోచనలు పెట్టుకుని నిద్ర మానేస్తే, ఆరోగ్యం పాడవుతుంది. కళ్ళుమూసుకుని పడుకో!" అన్నాడు.

"మరి మీరుకూడా నిద్ర పోలేదుగా.... మీఆరోగ్యం పాడవదా? భర్తవైపు తిరిగి అడిగింది.

"నాదా? నేనంటే.... నేనిప్పటిదాకా-ఏదో పుస్తకంచదువుకుని.... ఏం చెప్పాలో తెలియక తికమకపడుతున్న భర్తని గమనించిన సీతకీ నవ్వొచ్చింది,

"నాకు తెలుసు.... మీరుకూడా అరుణ గురించే ఆలోచిస్తున్నారు కదూ?" అడిగింది.

"ఇందులో ఆలోచించటానికేం ఉందోయ్? మంచి సంబంధం

చూసి పెళ్ళి చేసేం....హాయిగా అత్తగారింటికి పంపుతున్నాం. రేపటి్నించీ అది సుఖంగా కాపురం చేసుకుని నీలాగే పిల్లల్ని కంటూంది !"

"మగపిల్లల్ని ఎంతమందిని కన్నా ఫరవాలేదండీ—కానీ ఆడపిల్లల్ని మాత్రం కనకూడదు !" ఆమాట అంటున్న సీత గొంతులో ఆవేదన ధ్వనించింది.

"అవును, సీతా ! ఆడపిల్లని ఒక అయ్య చేతిలో పెట్టి అత్తవారింటికి పంపేటప్పుడు తల్లిదండ్రులెవరికైనా అలాగే అనిపిస్తుంది. అంతమాత్రంచేత ఇలాంటి తియ్యని అనుభూతిని వదులుకోగలమా, చెప్పు ?—మనిషి జీవించినంతకాలం ఈ అనుబంధాలూ, అనుభూతులూ తప్పవు !" భార్యకు ఊరట కలిగించాలని తాపత్రయపడుతున్న ప్రకాశం గొంతులోనూ విషాదం కనిపించింది.

ఏమోనండీ ! తెల్లవారి లేస్తే అరుణ అత్తవారింటికి వెళ్ళిపోతే ఇంక ఈ ఇంటి కళే పోతుందేమోననిపిస్తోంది. ఒకవైపు తన చదువేదో చదువుకుంటూనే, మరోవైపు ఇంట్లో బోలెడు చాకిరీ చేసేది. కాస్తంత తలనొప్పిగా వుందని పడుకుంటే చాలు, అడక్కపోయినా వచ్చి అమృతాంజనం రాసేది...." సీతకు కన్నీ రాగటం లేదు. కన్న హృదయం కలతపడిపోతోంది.

"నిజమేనోయ్.... మనం అంటే అరుణకి ఆపేక్ష ఎక్కువ. అసలు ఆడపిల్లలందరికీ అంతేనేమో ! తల్లిదండ్రులకు తల కొరివి పెట్టేది మగపిల్లాడే కావచ్చు ! కానీ వాళ్ళను అస్తమానూ తలుచుకునేది ఆడపిల్లలే !.... ఆ విషయం నువ్వు అప్పుడప్పుడు ఋజువుచేస్తుంటావుగా....!"

"ఏమండీ! నే వెళ్ళి అరుణను పిలుచుకొస్తానండీ!" హఠాత్తుగా లేవబోయింది సీత.

"ఎందుకూ ?"

"ఈ రాత్రికి నాదగ్గరే పడుకోమంటాను. ఎలాగా రేపు వెళ్ళిపోతుందిగదా !"

"చూడగా చూడగా నీకు మతిపోయినట్టుంది. అవతల అల్లుడున్నాడనే విషయం మరచిపోయావా? మనకంటే వయసయిపోయింది కనక వేరువేరు మంచాల మీద పడుకున్నాం. కానీ వయసులో వున్న వాళ్ళు! అందులోనూ పదిరోజులక్రితం పెళ్ళయినవాళ్ళు....ఈ సమయంలో నువ్వు రమ్మంటే మాత్రం అమ్మాయి వచ్చి నీ పక్కలో పడుకుంటుందా ?" నవ్వుతూ మందలించాడు ప్రకాశం.

తన తొందరపాటుకి సిగ్గుపడింది సీత.

"పిచ్చి పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టి కళ్ళుమూసుకొని పడుకో ! చీకటితోనే లేవాలి ! వాళ్ళ రైలు ఆరింటికే!" హెచ్చరించాడు.

కానీ సీతకి నిద్రపడితేగా ? ;

"ఏమండీ !" మరికొంతసేపయ్యాక మళ్ళీ పిలిచింది.

"ఏమిటి....నిద్రపొమ్మని చెప్పలేదూ ?"

"నిద్ర రావటం లేందే నన్నేం చెయ్యమంటారు ?"

"పోన్లే! నన్నయినా నిద్ర పోనీయ్ !" దుప్పటి మెడవరకూ లాక్కున్నాడు.

"అలాగే! కానీ ఆ గుంటూరు వాళ్ళ సంబంధం మన రవికి ఖాయం చేసేద్దామండీ!" లేచి వచ్చి ప్రకాశం ప్రక్కన కూర్చుంటూ అంది.

"సరిపోయింది! అమ్మాయి గురించి ఆలోచనలు అయ్యాయి. ఇక అబ్బాయిగారి గురించి మొదలుపెట్టావన్నమాట!" తాను కొంచెం జరిగి భార్యకు చోటిచ్చాడు ప్రకాశం.

"అవునండీ! ఇంకో ఏడాదిపోతే మనవాడు పెద్ద ఇంజనీరవుతాడు. బోలెడంత సంపాదించుకుంటాడు. మనకు మాత్రం లోటేముంది కనక? అందుకే వాళ్లు కట్నం ఎంతిస్తామన్నా సరే ఒప్పేసుకుందాం! అమ్మాయి అచ్చం మన అరుణలాగే ఉంటుందండీ. అప్పుడసలు నాకే బెంగా వుండదు. అరుణను చూసుకున్నట్లై మనం ఆ పిల్లని చూసుకుందాం!" గబగబా మాట్లాడేస్తున్న సీతవైపు అలాగే చూస్తుండిపోయాడు. కన్నతల్లి హృదయాన్ని ఆమె కళ్ళల్లో చూడగలిగాడు.

"ఏమిటండీ....మాట్లాడరేం?" మళ్ళీ రెట్టించి అడిగింది.

"అమ్మాయి వెళ్ళిపోతుందనే ఆందోళనలో నువ్వు ఏమిటేమిటో మాట్లాడేస్తున్నావు! చదువయిన తర్వాత ఉద్యోగంలో చేరితేనే కానీ తన పెళ్ళి ప్రస్తావన తేవద్దని ఇప్పటికి పదహారుసార్లు చెప్పాడు రవి! జ్ఞాపకం ఉందా?"

ప్రకాశం మాటలకు బదులు చెప్పలేని సీత నిస్సహాయంగా శూన్యంలోకి చూసింది.

మరునాడు పొద్దున్న అరుణ అత్తవారింటికి ప్రయాణమైనప్పుడు కన్నీటితో వీడ్కోలు చెప్పింది.

*　　*　　*

"నాన్నగారూ !"

రవి తనను పిలుస్తూ తట్టి లేపుతూంటే మెలకువ వచ్చేసింది ప్రకాశానికి.

కళ్ళు తెరచి కిటికిలోంచి బయటకు చూశాడు. తూర్పుదిక్కున ఇంకా వెలుతురు కనిపించలేదు.

"ఏమిట్రా ?" రవివైపు చూశాడు ఆవులిస్తూనే.

"నేను స్టేషన్‌కి వెళ్ళొస్తాను. పాలు వస్తే పోయించుకోండి !" రిస్ట్‌వాచి చేతికి పెట్టుకుంటూ చెప్పాడు రవి.

"స్టేషన్‌కా ?" అర్థంకాలేదు ప్రకాశానికి.

"అవున్నాన్నా ? ఇవాళ శ్యామల వస్తూందిగా ! స్టేషన్‌కెళ్ళి రిసీవ్ చేసుకోవద్దూ !"

ప్రకాశానికి అసలు విషయం అప్పుడు గుర్తుకొచ్చింది.

'మరిచేపోయాను ! కోడలు ఇవాళే వస్తూంది కదూ !' మనసు లోనే అనుకుని గడియారంవైపు చూశాడు.

"అయిదున్నర !"

"ఆరింటికి అలారం పెట్టానన్నావు కదూ ?" అడిగాడు ప్రకాశం.

"పొనసుకో ! ముందే మెలకువ వచ్చేసిందండి ! ఎలాగా లేచాను కదా అని రెడీ అయిపోయాను !"

"అయినా బండి ఏడున్నరకో, ఎనిమిదింటికో కదరా ! ఇప్పటి నించీ వెళ్ళి ఏం చేస్తావు ?" అడిగాడు మళ్ళీ.

"ఏమో ! రైళ్ళని నమ్మటానికి వీల్లేదు ! ఒకోసారి "టఫోర్ టైమ్" వచ్చేస్తాయి నాన్నగారూ !" తడుముకోకుండా చెప్పి. మళ్ళీ తండ్రిమాటలకు అవకాశం ఇవ్వకుండా బయటకు నడిచాడు రవి.

ఆ సమాధానం విన్న ప్రకాశానికి నవ్వొచ్చింది.

ఫోటోలో ఉన్న సీత నవ్వుతూంది.

"చూశావా, సీతా ! నువ్వు కోరుకున్నట్టుగానే నీకు నచ్చిన పిల్ల ఇవాళ ఈ యింటి కోడలుగా కాపురానికొస్తుంది. నీ కొడుకు తొందర చూశావా ? బండికి యింకా రెండుగంటలు టైమున్నా అప్పుడే స్టేషన్‌కి వెళ్ళిపోయాడు" ఫోటోలో ఉన్న సీతకు కంప్లెయింట్ చేశాడు ప్రకాశం.

"అవును, అన్నీ మీ పోలికలే వచ్చాయి. ఏం చేస్తాం ?" సీత మాట్లాడినట్లు అనిపించింది.

చెమ్మగిల్లుతున్న కళ్ళు తుడుచుకున్నాడు ప్రకాశం.

---

❊ ఆంధ్రప్రభ మార్చి '1980'